ఎట్టకేలకు అందుబాటులో ఎరువులు

- రైతు పక్షాన రణ గర్జనతో దిగివచ్చిన నిల్వలు
- మొదట విడత 50 శాతం వినియోగం


మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఖరీఫ్ వెదజల్లు సాగులో మొదట విడత ఎరువులు వేసిన తరువాత ఏపుగా ఎదుగుతోన్న వరి


చెరుకుమిల్లి సొసైటీలో నిల్వ ఉన్న యూరియాను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆకివీడు: ఖరీఫ్ రైతులకు ఎట్టకేలకు సొసైటీల ద్వారా యూరియా అందుబాటులోకి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌సాగుకు సరిపడినంత యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో లేవని రైతులు ఆందోళనకు దిగారు. రైతులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ రైతు పక్షాన రణగర్జన పేరుతో ఎరువుల కొరతను తీర్చాలని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేశారు. దీంతో ప్రభుత్వం కళ్లు తెరచి సొసైటీల ద్వారా రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఎరువులను సరఫరా చేశారు. ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేసుందుకు, రైతుల అవసరాల్ని సకాలంలో తీర్చకపోవడం వంటి వాటితో ప్రభుత్వ విధానాల్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు ప్రారంభించగా సుమారు 1010 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఏర్పడుతోంది. ఇప్పటికే 65 శాతంకు పైగా వరి నాట్లు పూర్తి చేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికే యూరియా కొరత తీవ్రంగా ఉంటంతో రైతుల్లో ఆందోళన పుట్టుకొచ్చింది. యూరియా, ఇతరత్రాల ఎరువుల కోసం పలు చోట్ల రైతులు క్యూ కట్టాల్సి వచ్చింది. కొరతను అధిగమించేందుకు రైతులు కదం తొక్కారు. అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ నిలబడి జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. కలెక్టర్లకు రైతు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. అన్ని మండలాలకూ యూరియా, ఇతర ఎరువుల కొరత తీర్చేందుకు సరఫరాను వేగవంతం చేసింది. ఆయా మండలాలకు యూరియా అందుబాటులోకి వచ్చింది. సొసైటీలు, ఎరువుల దుఖాణాలు, గ్రోమోర్ సెంటర్ల వద్ద యూరియా దిగుమతులు అయ్యాయి.

మొదట విడత వినియోగం

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాట్లు పూర్తి అయిన పంట పొలాల్లో మొదట విడతగా యూరియా చల్లారు. ఆకుమడుల్లో కూడా యూరియా చల్లారు. నాట్లు వేసిన వారం రోజుల్లో కలుపు మందు, యూరియా కలిపి చల్లుతారు. మరో పదిహేను రోజుల తరువాత ఎకరాకూ 25 కేజీల యూరియాతో పాటు డీఏపీ కలిపి చల్లుతారు. ఆ తరువాత కుదుళ్ల వేసుకునే దశలో మరో 25 కేజీల యూరియాతో పాటు పటాస్ కలిపి చల్లు తారు.

ఎరువుల దుఖాణాల్లో యూరియా నిల్

ప్రైవేట్ ఎరువుల దుఖాణాల్లో యూరియా స్టాక్ లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. యూరియా ఎరువుల్ని ఈ సీజన్‌లో ప్రభుత్వం ప్రైవేటు దుఖాణాలకు సరఫరా నిలుపుదల చేసిందంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులోకి తీసుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సొసైటీలకు యూరియా సరఫరా చేయడంతో నగదు చెల్లించి, నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆర్బీకే వ్యవస్థను రైతుల నుంచి దూరం చేసేందుకు ప్రభుత్వం సొసైటీల ద్వారా యూరియా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతోన్నాయి. ఆర్ఎస్కేల ద్వారా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

నాడు సాగుకు ముందే ఎరువులు

వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు ముందే యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చారు. యూరియాతో పాటు ఇతర ఎరువుల నిల్వాలు సమృద్ధిగా ఉండేవి. రైతులు ఇబ్బంది పడకుండా ఆర్బీకేలు సేవలదించేవారు. రైతు భరోసా పథకం సొమ్ము కూడా సాగుకు ముందే రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. సాగుకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారస్తుల్ని ఆశ్రయించకుండా రైతులు వత్తిడికి గురికాకుండా రైతు భరోసా పథకం ఉపయోగపడింది. నేడు ఆ పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

సకాలంలో అందుబాటులో ఉండాలి



అదును-పదును అన్నట్లుగా సమయానుకూలంగా ఎరువులు అందుబాటులో ఉండాలి. ఏ సమయంలో వేయాల్లో అదే సమాయానికి ఎరువు అందుబాటులో ఉంచాలి. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఖరీఫ్‌లో ఇలా ఉంటే రబీ పరిస్థితి ఏమిటి? రబీలో అధికంగా వాడాల్సి ఉంది. ఆర్గానిక్ ఎరువులు అందుబాటులో ఉంచాలి.

మల్లారెడ్డి శేష మోహనరంగారావు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రతినిధి, అప్పారావుపేట.

సొసైటీల్లో నిల్వలున్నాయి



ఎరువుల కొరత లేకుండా దిగుమతులు జరిగాయి. అన్ని మండలాల్లోని సొసైటీల్లో యూరియా ఎరువు అందుబాటులో ఉంది. మొదట విడత యూరియా చల్లేందుకు పూర్తి స్థాయిలో సొసైటీల్లో నిల్వలున్నాయి. మరి కొన్ని మెట్రిక్ టన్నులు దిగుమతికి ప్రతిపాదనలు పంపాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-కే.జీవన ప్రతాప్, ఏడీఏ, ఆకివీడు.

ఫ్రీగా అందటం లేదు



రైతులకు ఫ్రీగా యూరియా అందడం లేదు. అవసరానికి తగిన సమయంలో యూరియా అందడంలేదు. ఎరువుల షాపుల్లో వాళ్లకు అనుకూలంగా ఉన్న వారికి పది కట్టలు ఇస్తున్నారు. సొసైటీల్లో అందుబాటులోకి రాలేదు. రైతు సేవాకేంద్రాల్లో అసలు లేదు. రైతు యూరియాకు ఇంకా ఇబ్బంది పడుతున్నారు. సీజన్‌లో ఇబ్బంది రావడం దారుణం. వ్యవసాయాధికారులు చెబుతున్నవి నమ్మశక్యంగా లేవు. **తోట శివాజీ, రైతు, సిద్ధాపురం.**

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. విస్సాకోడేరు విద్యుత్ ఉప కేంద్రం వద్ద, విస్సాకోడేరు ఇండస్ట్రియల్ ఫీడర్, వాటర్ వర్క్స్ ఫీడర్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాళ్ల..

కాళ్ల: మండలంలోని కాళ్ల 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి విద్యుత్ లైన్లు మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు నిమిత్తం శనివారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కాళ్ల, కోలనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రొయ్యలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదంటూ ఫిర్యాదు

భీమవరం: రొయ్యలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసం చేశారంటూ భీమవరం పట్టణానికి చెందిన లిఖిత మెరైన్ ఫుడ్స్ అండ్ ఎల్ఎస్ఆర్ మెరైన్ ఫుడ్స్ సంస్థల మేనేజింగ్ పార్ట్నర్ లింగం నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు శుక్రవారం చెప్పారు. నాగేశ్వరరావు భీమవరం పరిసర ప్రాంతాల్లో రైతుల వద్ద నుంచి రొయ్యలు కొనుగోలు చేసి వాటిని ఐస్ ప్యాకింగ్ చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. గత ఏడాది గోవా రాష్ట్రానికి చెందిన రాజేందర్ సింగ్ జారీ, పియూష్ రాజేందర్ సింగ్ జారీలు ఫిర్యాది నాగేశ్వరరావు వద్ద నుంచి సుమారు రూ. 1.35 కోట్లు విలువైన రొయ్యలు కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించకుండా మోసం చేశారంటూ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు చెప్పారు.

క్లుప్తంగా

రహదారి నిర్మాణానికి భూమిపూజ


కోపల్లెలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలం కోపల్లె గ్రామంలోని పంటకాలువ గట్టు రోడ్డు నిర్మాణంకు శుక్రవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు సుమారు రూ.9లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు, గ్రామ సర్పంచ్ బూడి నాగమణి, ఉపసర్పంచ్ తెలిపారు. పూర్తి నాణ్యతతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో కేజీఆర్ఎల్ కళాశాల విద్యార్థి ప్రతిభ


భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో రామ్‌అనీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో భీమవరం కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థి చేబోలు రామ్‌అనీష్ 800 మీటర్ల పరుగుపందెం,లాంగ్ జంప్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మెంటే రామ్‌మనోహర్ చెప్పారు. శుక్రవారం విద్యార్థిని అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన రామ్‌అనీష్ ఈనెల 9వ తేది నుంచి మూడురోజులపాటు చీరాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇంటి రామచంద్రమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ షేక్ రహీమ్, ఫిజిక్స్ విభాగాధిపతి నీలాపు సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపూజీ లెర్నింగ్ సెంటర్

భీమవరం: భీమవరం పట్టణంలో వసుధపౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదిన బాపూజీ లెర్నింగ్ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాల్టీ పరిధిలోని దుర్గాపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసే ఉచిత లెర్నింగ్ సెంటర్‌ను సోమవారం సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభిస్తామన్నారు. సెంటర్‌లో చదువులో వెనుకబడి విద్యార్థులకు ప్రత్యేక బోధనతో పాటు ఇతర నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రసాదరాజు కోరారు.

బాలా త్రిపుర సుందరీదేవికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీ అమ్మవారు

భీమవరం:(ప్రకాశంచౌక్): పట్టణంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి 108 తమలపాకుల దండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు సూర్యనారాయణ, అరుణ దంపతులు, జగదీష్, భవ్యశ్రీ, రాజేష్ యాదవ్, కళ్యాణి దంపతులు, సహస్ర సాయి, దన్విత్ సాయి కృష్ణ, దన్విక ల సహకారంతో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన


పాలకొల్లు బస్టాండ్‌లో కళాజాత ప్రచారం

పాలకొల్లు సెంట్రల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో ప్రజలకు కళాజాత కళాకారులు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాజెక్టు అధికారిణి ఎం ఉమ, ఏసీడీపీఓ నాగరత్నం, మల్లేశ్వరి, నాగ పద్మావతి, సుధ, మోహనరాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

విశేష అలంకరణల్లో అమ్మవార్లు


స్థానిక పెద్దింటి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


స్థానిక కనకదుర్గమ్మ వారికి గాజులతో అలంకరణ చేసిన దృశ్యం


కాళ్ల విశేష అలంకరణలో దుర్గమ్మ


మావుళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆకివీడు: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పండుగ సందర్భంగా అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పెద్దింటి అమ్మవారి దేవాలయాన్ని, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయాన్ని, వనువులమ్మ వారిని, కనక దుర్గమ్మ అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద కనక దుర్గమ్మకు గాజులతో అలంకరణ చేయగా, సంతపేటలోని కనకదుర్గమ్మకు పసుపు కొమ్ములతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

విశేష అలంకరణలో మావుళ్లమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి వరలక్ష్మి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మావుళ్లమ్మకు లక్ష గాజులతో ప్రత్యేక ఆలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వరలక్ష్మీ వ్రతం పురష్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం పలువురు భక్తులు సుమారు 11 లక్షల విలువ చేసే 108 బంగారు పుష్పాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సహాయ కమీషనర్ బుద్ద మహాలక్ష్మీ నగేష్ , ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బధిరోన్నత పాఠశాల వార్షికోత్సవాల్లో భాగస్వాములు కావాలి


భీమవరంలో వెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల వార్షికోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ దృశ్యం

భీమవరం: పట్టణంలోని వెంకటేశ్వర బధిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవ వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బధిరోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, బధిర క్రీడాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించే వార్షికోత్సవ వేడుకల బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ టీటీడీ నిర్వహిస్తున్న పాఠశాలలో విద్యనభ్యసించిన అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారన్నారు. వార్షికోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు సిహెచ్ తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఈ పాఠశాలలోని వార్షికోత్సవాన్ని డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభ భవనంలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది పాల్గొంటున్నారన్నారు. బ్రోచర్ ఆవిష్కరణలో వేడుకల సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాసరాజు, రామచంద్ర రావు, జి గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, జి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


ఆలయం వద్ద షెడ్ ప్రారంభం చేస్తున్న పెద్దలు

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ళ గ్రామంలో వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కాళ్ళకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయలతో భక్తులకు సౌకర్యార్థం షెడ్డు నిర్మించారు. ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకట రత్న ప్రసాద్, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు.

రారెత్తిస్తున్న ఎండలు


కొనుగోళ్లుదారులు లేక వెలవెలబోతున్న పండ్లు, కూరగాయల దుకాణాలు


ఎండ దెబ్బకు భీమవరం జనం లేక పీపీ రోడ్డు

- జనం ఉక్కిరిబిక్కిరి
- దెబ్బతింటున్న పుట్‌పాత్ వ్యాపారులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఎండలు విజృంభించడంతో జనం విలవిలాడుతున్నారు. వర్షకాలంలో ఎండల తీవ్రత చూసి జనం ఆశ్చర్యపోతున్నారు. ఉదయం 7 గంటలకే ఎండ తీవ్రత పెరగడం, ఉక్కపోత ఉండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు ఉండడంతో జనం ఇంటికి, కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ముఖ్యమైన పని ఉంటే గాని మధ్యాహ్నం బయటకు రావడం లేదు. ఎండలో ప్రయాణించడానికి ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరంలో రోజుకు 36 నుంచి 40 డీగ్రీల ఉష్ణోగత్ర నమోదవుతుంది. వృద్ధులు, పిల్లలు ఎండ, ఉక్కపోతలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రంగా ఉండడంతో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


ఎండ దెబ్బకు వ్యాపారాలు లేవు



ఎండలు దారుణంగా ఉండడంతో పుట్‌పాత్‌పై వ్యాపారాలు ఉండడం లేదు. గత వారం రోజుల నుంచి కాస్తున్న ఎండలకు వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. ఎండ దెబ్బకు జనం రోడ్డుపై ఆగి పండ్లు, కూరగాయలు కొనుగోళ్లు చేసే పరిస్థితి లేదు. పండ్లు దెబ్బతిని పెట్టుబడులకు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుంది.

ఆబోతు చిన్న రాజా, పండ్లు వ్యాపారి, భీమవరం

రొయ్యల చెరువులకు ముప్పు



ఎండ వల్ల రొయ్యలకు ముప్పు తెస్తుంది. ఒక్కసారిగా ఎండ, వెంటనే వాతావరణం చల్లబడటంతో రొయ్యలకు ఆక్సిజన్ లోపం వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే ట్రంప్ ట్రయ్ విధానంతో ఆక్వా రైతులు ధరల పతనంతో ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఎండ, ఉక్కపోత వాతవరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతవరణం మారితే ఆక్వాకు మేలు జరుగుతుంది.

వీరవల్లి శ్రీనివాస్, ఆక్వా రైతు, తోకలపూడి.

15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

నరసాపురం: స్థానిక మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్ట్ 15న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రతినిధి రాబర్ట్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వలందర్ రేవులో మధ్యా హ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సులవారు పాల్గొనవచ్చిని పేర్కొన్నారు.

దర్భరేవు డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలి


దర్భరేవు డ్రెయిన్ తవ్వకంపై మాట్లాడుతున్న నాయకులు

నరసాపురం రూరల్: దర్భరేవు – కొత్తకాయలతిప్ప డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో తవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు కటకంశెట్టి మాణిక్యాలరావు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు రైతులతో కలిసి కాలువ పనులను పరిశీలించారు. దర్భరేవు డ్రెయిన్‌ను ఆధునికీకరించి 20 ఏళ్లయిందన్నారు. ఇటీవల ఈ డ్రెయిన్ ఆధునికీకరణకు సుమారు రూ.45 లక్షల వరకు నిధులు మంజూరు చేశారని, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కాలువకు ఇరు వైపులా మట్టితీసి మధ్యలో ఉన్న పూడిక తీయకపోవడంతో నీరు పారే పరిస్థితి లేదని తెలిపారు. తక్షణమే కాలువ మధ్యలో ఉన్న మట్టి తవ్వించాలని కోరారు. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి దర్భరేవు నుంచి కొత్తకాయలతిప్ప వరకు ఆధునికీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు సంగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: దోమ పుట్టుకను నివారించేందుకు ఖర్చురహితమైన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఇంటా పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు జంగం చెర్వు ప్రాంతంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, కీటకజనిత వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతిరోజూ డ్రైడే పాటించాలని ఇందులో భాగంగా గృహాల్లో ఫ్రిజ్ వెనుక ఉన్న వేస్ట్ వాటర్ కంటైనర్‌లోని నీటిని తీసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములపైన మూతలు ఉంచడం, ఇంటిపైభాగంలో ఉండే ఓవర్ హెడ్ ట్యాంక్‌పై తప్పనిసరిగా మూత ఏర్పాటుచేయడం వంటి జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

భీమవరం: భీమవరం పట్టణంలోని జంక్షన్ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సుబ్రహ్మణ్యం చెప్పారు. నరసాపురం నుంచి లింగంపల్లి వెళుతున్న నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ జంక్షన్‌లో ఆగిన సమయంలో సుమారు 50 ఏళ్ల వయసు గల వ్యక్తి పట్టాలపై తలపెట్టుకుని పడుకోవడంతో రైలు కదలిన సమయంలో తల మొండం వేరయ్యాయని, మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.